క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే ఆనందమయ జీవితం



రంగంపేటలో పిరమిడ్ సభ్యులతో మాట్లాడుతున్న కేవీ రావు

రంగంపేట: ఆధ్యాత్మికతతోనే ఆనందమయ జీవితం సాధ్యమవుతుందని విశాఖపట్టణానికి చెందిన పిరమిడ్ సొసైటీ సభ్యుడు కేవీ రావు సూచించారు. మండల కేంద్రమైన రంగంపేటలోని దుర్గమాంబ పిరమిడ్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను తాను తెలుసుకుని, ఆధ్యాత్మిక పథంలో ఆనందమయ జీవనం గడపడమే జీవితానికి సార్థకత చేకూరుస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన, ఆనందమయ జీవితం గడపడానికి ధ్యాన కేంద్రాలు, సత్సంగాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ సభ్యులు ఉండవల్లి భ్రమరాంబిక, లక్ష్మి, సత్యవతి, తులసి, దుర్గ, స్వర్ణలక్ష్మి పాల్గొన్నారు.

చేపలతో వంటకాలపై శిక్షణ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలోని చేపల కేంద్రంలో కేంద్రీయ మత్స్య శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలకు చెందిన మహిళలకు చేపలతో వంటకాలపై సోమవారం శిక్షణనిచ్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ డా.షమ్నా చేపలతో పకోడి, కట్లెట్, సమోసాలు, ఊరగాయ ఎలా తయారుచేసుకోవాచ్చో మహిళలకు అవగాహన కల్పించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాజానగరం: క్యాన్సర్ వ్యాధిపై బాల్యం నుంచే అవగాహన ఉండటం ఎంతో అవసరమని వెలుగుబంద ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగ్నేశ్వరరావు అన్నారు. ఆ పాఠశాలలో సోమవారం రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, డస్ట్ బిన్లు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మధురపూడి: కోరుకొండలోని శ్రీ రాజుబాబు జూనియర్ కాలేజీలో సోమవారం నిర్వహించిన ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జనరల్ విభాగంలో 434 మందికి 399 మంది, ఒకేషనల్‌లో 115 మందికి 109 మంది హాజరయ్యారు.

18 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: చెన్నైకి తరలిస్తున్న 18 కేజీల గంజాయిని రెండో పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో వైజాగ్ సమీపంలోని నక్కపల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న నిందితులు బస్సులో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతంలో దాడి చేశారు. చెన్నైలోని తేని జిల్లా ఉత్తమపాలయానికి చెందిన వనరాజ్, వచ్చుతెవర్ ఎలనదిరం అనే ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 18 గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రాజమహేంద్రవరం 5వ ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో రిమాండ్ రిపోర్టుతో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకోసం దగ్గరలో పోస్టాఫీసులో రిజిస్టర్ చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తుందన్నారు. దీని కోసం 150 యూనిట్లు విద్యుత్ వినియోగానికి ఒక కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దానికి రూ.55 వేల నుంచి రూ.65 వేల వరకు వ్యయం అవుతుందని, ఒక కిలో వాట్స్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల వరకు రాయితీ కల్పిస్తుందన్నారు. సొంతిల్లు ఉన్నవారందరూ ఈ పథకానికి అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, వివరాలకు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలన్నారు. మొదటి విడతలో భాగంగా రిజిస్టర్ చేసుకున్న మొదటి కోటి మందికి సబ్సిడీ కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 85005 90045, 94930 95398 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నిరుపేదలకు ఆరోగ్య రక్ష



పందలపాకలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న వలంటీర్లు

- ఆరోగ్యశ్రీ కార్డుల పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- సంతోషం వెలిబుచ్చుతున్న ప్రజలు

బిక్కవోలు: నిరుపేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటివరకూ రూ.5 లక్షలుగా ఉన్న వైద్య వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచింది. దీన్ని ఆచరణలోకి తీసుకురావడమే కాకుండా వలంటీర్ల ద్వారా ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ఇంటింటికీ అందిస్తున్నారు. ప్రజలు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేకుండా ఖర్చంతా ప్రభుత్వమే భరించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కోసం గత రెండు నెలలుగా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుంది. అనపర్తి నియోజకవర్గంలో 92,766 మంది కుటుంబాలకు కొత్త ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటివరకూ 71,605 కుటుంబాలకు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే రోగి తాను కోరుకున్న కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యాన్ని పొందొచ్చు. గతంలో రూ.5 లక్షల పరిమితి కారణంగా క్యాన్సర్ తరహా చికిత్సలు తీసుకునే రోగులు ఇబ్బందులు పడేవారు. ఆ పరిమితి దాటాక ఖర్చులన్నీ రోగులే భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిమితిని ఎత్తి వేస్తూ రూ.25 లక్షల వరకూ ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేశారు. గతంలో ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 చికిత్సలు మాత్రమే ఉండగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వాటిని ఏటేటా పెంచుతూ ప్రస్తుతం 3,257 వ్యాధులకు తీసుకొచ్చారు. 2019 నుంచి ఇప్పటివరకూ అనపర్తి నియోజకవర్గంలో 13,012 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించారు. వారి కోసం ప్రభుత్వం ఈ ఐదేళ్లలోనే రూ.43,68,74,000 ఖర్చు చేసింది.

మండలాల వారీగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వివరాలు

మండలం	కుటుంబాలు	ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
అనపర్తి	22,385	18,869
బిక్కవోలు	21,153	18,147
రంగంపేట	21,726	14,841
పెదపూడి	26,502	19,748
మొత్తం	92,766	71,605

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు



పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచింది. దీనివల్ల నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుంది. ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అర్హులందరికీ వలంటీర్ల ద్వారా చేరవేస్తున్నాం. కార్డులను ఇంటింటికీ చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, బిక్కవోలు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొమరిపాలెంలో పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొమరిపాలెంలో ఇంటి పట్టాల పంపిణీ

బిక్కవోలు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొమరిపాలెంలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు ఇవ్వడంతో పాటు దానిపై సర్వ హక్కులు కలిగేలా రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు అందిస్తున్నామన్నారు. దీంతో లబ్ధిదారులు ఆపద సమయంలో తన ఇంటిని అమ్ముకునే వీలుంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంలో పేదలందరికీ ఇంటి స్థలాలు అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌కు అండగా నిలిచి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలోని జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు తాడి అరవింద, కేపీఆర్ సంస్థ చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి కృషి



కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- జగన్ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించండి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే రాజా దిశానిర్దేశం

మధురపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని ఆయన నివాసంలో గల పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమన్నారు. సమష్టి కృషితోనే నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయగలమన్నారు. అత్యధిక మెజార్టీ గెలిచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలే పార్టీకి కొండంత అండ అన్నారు. జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి జరిగిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. రూ.217 కోట్లతో గోదావరి రక్షిత నీటికి ఇంటింటికీ అందించడం, రూ.104 కోట్లతో సీతానగరం నాలుగు లేన్ల రహదారి, రూ. 91 కోట్లతో గోదావరి ఎగపోటు ముంపు సమస్య నివారణ, నియోజకవర్గంలో 20,182 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాలను వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి, పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అక్షయ అమృతం పేరిట రోజూ 3 మండలాల్లో 500 మందికి భోజనం అందించడం సంతోషకరంగా ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేసుల పోసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు



దివాన్‌చెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాజానగరం: ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలను చైతన్యపరుస్తున్నారు. మండలంలోని దివాన్ చెరువులో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం – అనర్థదాయకం అనే అంశంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ ఇతర వస్తువుల మాదిరిగా మట్టిలో కలిసిపోదని, తద్వారా పర్యావరణానికి చాలా హాని చేస్తుందన్నారు. దీనివలన భూగర్భ జలాలు కాలుష్యం బారిన పడటమే కాకుండా పంట పొలాలు కూడా దెబ్బతింటాయన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక వజ్రాయుధం వంటిదని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అన్నారు. దివాన్ చెరువులోని ఎస్సీ పేటలో ఓటు హక్కుపై ప్రజలను చైతన్య పరుస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు.

నేటి నుంచి ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు

మధురపూడి: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశానికి మంగళవారం నుంచి ఈనెల 25 వతేదీ వరకూ అడ్మిషన్లు జరుగుతాయని ఎంఈఓ టి.కుశలవదొర తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీ విద్యార్థులకు పది శాతం, ఎస్టీ విద్యార్థులకు నాలుగు శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ (గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1,20,000 లోబడిన) పిల్లలకు ఆరు శాతం సీట్లు ఇస్తామన్నారు. అడ్మిషన్లు కావాల్సిన వారు గ్రామ సచివాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం లేదా ఏదైనా నెట్ సెంటర్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

విజయవంతంగా తుంటి మార్పిడి శస్త్ర చికిత్స

అనపర్తి ఏరియా ఆసుపత్రి వైద్యులను సత్కరించిన ఎమ్మెల్యే



శస్త్ర చికిత్స చేయించుకున్న శ్రీధర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అనపర్తికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తికి తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం శస్త్రచికిత్స చేయగా సోమవారం శ్రీధర్ పూర్తిగా కోలుకున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసిన వైద్యుల బృందాన్ని అభినందిస్తూ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వైద్యులను సత్కరించారు. వివరాల్లోకి వెళితే శ్రీధర్ తుంటి సమస్యతో ఆసుపత్రిలో చేరారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత స్పందిస్తూ ఆరోగ్యశ్రీ పథకం కింద ఏరియా ఆసుపత్రికి రూ.5 లక్షలు మంజూరు చేయడంతో పాటు శస్త్ర చికిత్సకు సంబంధించిన వైద్య పరికరాలను సమకూర్చారు. ఆసుపత్రి ఎముకల వైద్య నిపుణులు డా.ప్రదీప్ సుందర్, మత్తు వైద్య నిపుణురాలు డా.రజనీ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీధర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని డీసీహెచ్ఎస్ డా. ఎం.సనత్‌కుమారి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌కు సమర్థవంతంగా చికిత్స చేసిన వైద్యులను అభినందించారు. ఇదే తరహా శస్త్ర చికిత్స చేసేందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఖర్చువుతుందన్నారు. అంతటి ఖరీదైన శస్త్ర చికిత్సను ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యంపై చూపుతున్న శ్రద్ధకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.తాడి రామగురెడ్డి, డా.తరుణ్, డా.వర్మ, డా.డేవిడ్, డా.చంద్రశేఖర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బాల, ఉమాశంకర్, గుంటూరు శ్రీను, చింతా శ్రీను, ఎంపీటీసీ ఏడుకొండలు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి సర్వం సిద్ధం

- వంగలపూడి రేవు నుంచి నడకమార్గం ఏర్పాటు
- భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్న యంత్రాంగం
- ఎమ్మెల్యే రాజా ఆదేశాలపై పనులు వేగవంతం



పట్టిసీమ వెళ్లడానికి వంగలపూడి రేవు నుంచి గోదావరిలో ఏర్పాటు చేస్తున్న నడక మార్గం

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు (గతంలో పశ్చిమ గోదావరి) జిల్లాలోని పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తులకు ఈ ఏడాది నడక మార్గమే ఆధారం. వంగలపూడి రేవు నుంచి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, పలు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాలు జారీ చేశారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయ ఉంది. దానిపై పంచాయతీ ఆధ్వర్యంలో నడక మార్గం (వారధి) ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు గోదావరి పాయపై వేసిన వారధి మార్గం ఎంతో ఉపయోగపడుతుంది. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరు దూరంలోని గోదావరి పాయ దాటిన తరువాత అక్కడ నుంచి సుమారుగా మూడున్నర కిలోమీటర్లు ఇసుకలో నడిచి పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి చేరుకోవచ్చు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచనల మేరకు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భక్తులకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. వంగలపూడి పంచాయతీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించగా సైకిల్ స్టాండ్‌ను రూ.65 వేలకు చిడిపి బాలకృష్ణ, ట్రాక్టర్లపై తరలింపును రూ.65 వేలకు ఇనుగంటివారిపేటకు చెందిన గుల్లి దామోదరం పాడుకున్నారు. రేవు నుంచి ఇసుక మార్గంపై వెళ్లడానికి, అనంతరం ఆలయం వరకు ట్రాక్టర్‌పై వెళ్లడానికి నగదు చెల్లించాలి.

రామచంద్రపురంలో..

పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం వద్ద గోదావరి పాయ నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం వరకూ నడిచి వెళ్లడానికి అనువుగా ఉంది. పురుషోత్తపట్నం వద్ద గోదావరి పాయ నిలిచిపోయింది. దీని వలన ఇసుక తిప్పలు ఏర్పడ్డాయి. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు తదితరులు భక్తులు వెళ్లడానికి రేవు వద్ద చర్యలు చేపట్టారు.

నేటి నుంచి నరసన్న ఆలయంలో సుదర్శన యాగం

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- అంకురార్పణ చేసిన ఎమ్మెల్యే రాజా దంపతులు



విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి



అంకురార్పణ సందర్భంగా పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా, రాజశ్రీ దంపతులు

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు యాగం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. దేవస్థానంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక కల్యాణార్థం శ్రీ అష్టముఖ గండ భేరుండ లక్ష్మీనరసింహ సుదర్శన యాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విష్ణుమూర్తి ఆయుధాల్లో అత్యంత ప్రధానమైనది సుదర్శన చక్రమని, దానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. యాగం నిర్వహించడం ద్వారా దుష్టశక్తుల పీడ తొలగిపోతుందని, లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో గంధం నారాయణ రావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతినీడి అశోక్, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, పసుపులేటి బుల్లియ్య నాయుడు, బొరుసు బద్రి పాల్గొన్నారు.

వైభవంగా అంకురార్పణ

శ్రీ అష్టముఖ గండభేరుండ లక్ష్మీ నరసింహ సుదర్శన యాగంలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి ఆలయంలో అంకురార్పణ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామివారిని ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అనంతరం పూజా కార్యక్రమాలను చేశారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాలలో పలువురికి వైద్య సేవలు అందించారు. శ్రీ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు సత్యం రమేష్ బాబు, రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. అలాగే వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శిబిరంలో 72 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో తొమ్మిది మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి తరలించారు.

నగదు వితరణ

రాజమహేంద్రవరానికి చెందిన రామకృష్ణ మిషన్, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి నిర్వహించే వైద్య శిబిరాల నిర్వహణ ఖర్చులకు వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వీరభోగ వసంతరావు నగదును అందించారు. అలాగే రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వంద మంది పేదలకు చీరలు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి సుశీల, వై.వెంకట నారాయణ, కె.శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

నూరు శాతం పల్స్ పోలియో



పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు

సీతానగరం: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం నూరుశాతం విజయవంతమైందని పీహెచ్‌సీ డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎస్.రాజు తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఐదేళ్ల లోపు పిల్లలు 5,689 మంది ఉండగా ఆదివారం 5,469 మందికి పోలియో చుక్కలు వేసి 96 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి సోమవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేశారన్నారు. మండలంలో 36 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామని, 165 మంది సిబ్బంది పాల్గొన్నారన్నారు.

పరీక్షకు 25 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన 692 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 667 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆర్ఐఓ నరసింహ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఆయన పాలనకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఇది చూసి ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఆమె ఆధ్వర్యంలో 30 మంది టీడీపీకి చెందిన మహిళలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరిశెట్టి కుటుంబరావు, నాయకులు దాడి శివాజీ, కేఆర్‌జే రాజేష్, శ్రీరంగపట్నం ఎంపీటీసీ సభ్యుడు తనకాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.